# మామకిచ్చిన మాట

మల్లి ఆనందంగా వుంది ఆ సాయంత్రం. ఇల్లంతా శుభ్రంగా చిమ్మింది. బయట నీళ్ళుచల్లి ముగ్గు వేసింది. తడిక చాటు పెట్టుకుని లక్స్ సబ్బుతో ఒకటికి రెండు సార్లు స్నానం చేసింది. తరువాత పోయిన పండక్కి మామ తెచ్చిన చుక్కలచీర, జాకెట్టు ధరించింది. గుడిసెలోకి వెళ్లి అద్దం ముక్కలో ముఖం చూసుకుంటూ తల దువ్వుకుంది. ఆనక కళ్ళకు కాటుక పెట్టుకుంది.

అన్ని పనులు పూర్తి చేసుకుని దుష్యంతుడి కోసం నిరీక్షించే శకుంతల ఎదురుచూడసాగింది. మావ 'సాయంత్రం సినిమాకెల్దాం వుండు' అని అన్నాడు సినిమా అడవిరాముడట. ఆ సినిమా చూసొచ్చిన తరువాత ఆ పాటలు పాడుతూ ఇంట్లో డాన్సు చేయాలనేది మల్లి ఆశ.

తనను రమ్మన్నా రిక్షా స్టాండుకి వెల్తుంది. కాని మావకు అనుమానం. తన అందం చూసి ఎవరయినా ఎగరేసుకుని పోతారేమోనని. నవ్వుకొంది మల్లి.

"ఏందే మావ కోసమేనా కాలుకాలిన పిల్లిలా గుడెసలోకి, బయటికి అట్టా తిరక్కపోతే ఏటి దగ్గరకెల్లి ఎదురు సూడకూడదూ"

అంది నారాయుడి పెళ్ళాం చంద్రి.

మల్లి సిగ్గుపడి గుడిసెలోకి దూరి అగ్గిపుల్ల గీసి దీపం వెలిగించింది.

'సెంద్రి సెప్పినట్టు ఈడ కూసోని మావ వస్తున్నాడేమో సూసేకంటే ఏటిదాక ఎల్లిసూత్తా' అనుకొంటూ ఏటి ఒడ్డుకు బయలు దేరింది.

ఏటికి అవతల అంచున నెల్లూరు పట్టణమయితే. ఏటి ఇవతల అంచున మల్లి నివసించే పల్లె వుంది. ఈ రెండిటికీ మధ్య వుండేది నిజానికి ఏరుకాదు అది పెన్నానది.

మల్లి కాపురానికి వచ్చి ఇంకా నాలుగు నెలలు కూడా పూర్తి కాలేదు. ఇద్దరూ జంటగా వెళ్ళి ఇప్పటికే ఇరవై సినిమాలు చూశారు. సినిమా మారకూడదు వెళ్లాల్సిందే. ఆ రోజు ఉదయమే గుడిసె దగ్గర్నుంచి వెళ్ళేటప్పుడు చెప్పి పోతాడు సాయంత్రం సినిమా కెల్దామని. అంతే మల్లి షోకు చేసుకుని రెడీగా వుంటుంది. బారెడు మల్లె దండతో వస్తాడు రాముడు. అది తలలో తురుముకుని చేయి చేయి పట్టుకొని ఏటి ఇసుకలో నడుస్తూ సినిమాకెళ్తారు.

ఇద్దరూ నేలకే వెళ్తారు. ఇంటర్వెల్‌లో రాముడు హాల్లోకి టీ తెస్తాడు, టీతో పాటు వేరుశక్కాయలు, మురుకులు తెస్తాడు. అదొక అనుభూతి మల్లికి. హాల్లో జనం పల్చగా వుంటే మొగుడి ఒడిలో తల పెట్టుకుని సినిమా చూస్తుంది. పాటలు వచ్చినప్పుడు మాత్రం కళ్ళింత

చేసుకుని చూస్తారు మొగుడూ పెళ్లాలు. పాటకి అనుగుణంగా నాయకీ నాయకులు అడుగులు కదిలించడం అతి జాగ్రత్తగా పరిశీలిస్తారు. ఈ పరిశీలనా జ్ఞానం చిన్నతనం నుంచి వుండబట్టేగదా తను రాముడులాంటి మొగుడ్ని సంపాదించలిగిందనుకొంటుంది మల్లి అప్పుడప్పుడు.

ఏటి ఒడ్డుకు చేరి, దారి పక్కనే వున్న వేపచెట్టు బోదెకు ఒక కాలు ఆనించి అనుకుని, ఒక చేత్తో అందుబాటులో వున్న కొమ్మను పట్టుకుని, ఇంకో చేతి వ్రేళ్ళగోళ్లు కొరుక్కుంటూన్న మల్లికి రాముడితో తన వివాహం మరొకసారి కళ్లకు కట్టినట్లు గుర్తొచ్చి ఆ ఊహల్లో తేలిపోసాగింది.

తను పుట్టింది ఆ పల్లెకు అయిదు మైళ్ళదూరంలో ఉన్న ఇంకో పల్లెలో. మొత్తం యాభై గుడిసెలు దాకా వున్నాయి అక్కడ. అందులో వున్న ఆడా మగా అంతా వ్యవసాయ కూలీలకు పోతుంటారు. పక్క గ్రామాల్లో వరికోతలకు, నాట్లకు, కలుపుతీసేందుకు, కుప్ప నూర్పుళ్ళకు పోతుంటారు. పని రోజూ వుండదు. పనిలేని రోజుల్లో చేపలు, ఎండ్రకాయలు పట్టడానికి వెళ్తుంటారు. పగలు ఎంత కష్టపడ్డా రాత్రిళ్ళు పొద్దు పోయేవరకూ దరువులూ, డాన్సులు. వాటితో పాటు సినిమా పాటలు. ఆటా, పాటా రోజూ వుండాల్సిందే.

ఆ రోజు తన అక్కకు మగబిడ్డ పుట్టాడు. అది తొమ్మిదవ రోజు. ఆరోజు ప్రత్యేక కార్యక్రమం వుంది. మిగతా పల్లెల్లో వున్న వాళ్ళ కులపోల్లందరికీ చెప్పి అంపారు. సాయంత్రానికి బంధువులంతా వచ్చారు. ఆచారం ప్రకారం అందరూ తమతో పాటు శేరు బియ్యం, ఒక కోడి తెచ్చారు. ఆ సాయంత్రం వాళ్ళు తెచ్చిన బియ్యంతో, కోళ్ళతో మంచి విందు జరిగింది. తిన్నంత తిన్నారు. తాగినంత తాగారు.

పదిగంటల పైన ఇంటి ముందు ఖాళీజాగాలో ఆట మొదలయ్యింది. పైన తెల్లని వెన్నెల. తన అన్న మద్దెల వాయిస్తున్నాడు, తాళం వేస్తున్నాడు పక్కింటి సుబ్బడు. అక్క భర్త రంగయ్య మరో మద్దెల వాయిస్తున్నాడు. పక్క ఊరునుంచి వచ్చిన దంపతులు పాడుతున్నారు. అన్నీ సినిమాల్లోని పాటలు. వాటికి అనుగుణంగా మద్దెల మోతలు. గజ్జలు కట్టుకుని జంటలు జంటలుగా డాన్సులు వేస్తున్నారు. వావి వరసలు లేవు. ఆడమగ భేదం లేదు. ఎవరికి కావాలసిన ఆనందం వారు జుర్రుకొంటున్నారు. ఇంతలో 'దసరాబుల్లోడు' సినిమాలో పాటలు మొదలయ్యాయి.

'ఎట్టాగో ఉన్నాది ఓలమ్మీ... ఏటేటో అవుతుంది సిన్నమ్మీ...' పాట ఎత్తుకున్నాడు గాయకుడు.

ఆ పాటంటే ఎంతో ఇష్టం మల్లికి. కాళ్ళు భూమి మీద ఆనలేదు. గజ్జెలు కట్టుకుని పరిగెత్తుకు వెళ్లి రంగంలో నిలబడింది. అప్పటికే అర్థరాత్రి అయింది. అలసి పోయిన జంటలు పక్కకు వచ్చాయి.

"ఇది నాసెల్లి. దసరాబుల్లోడు పాటలకు డాన్సు ఏస్తది. దీన్తో సమంగా ఆడగలిగినోడికి దీన్నిస్తం. ఓలుకూడా ఒల్లుకోం. ఎవుడైనా మొగోడుంటే శాలెంజ్" అన్నాడు మల్లి అన్న మద్దెల వాయించడం ఆపి.

పెళ్ళికాని యువకులు, పెళ్ళయిన యువకులు అంతా మీసాలు మెలేశారు. కాని ఏపుగా ఎదిగి వయ్యారాలు నింపుకుని మోకాలుమీద చేతులుంచి విశాలనమైన కళ్ళు విప్పార్చి చూస్తున్న వాళ్ళ కళ్ళకు రాజకుమారి దుస్తుల్లో వున్న కె.ఆర్.విజయ, ఎల్.విజయలక్ష్మి, విజయలలిత కనిపించారు. కొద్ది దూరంలో కూర్చొని వున్న రాముడి కంటికి ఆటవిడవకుండా వరుసగా తను ఇరువైసార్లు చూసిన దసరాబుల్లోడు సినిమాలో అసలైన వాణిశ్రీ గుర్తు కొచ్చింది.

పెద్దగా ఈలవేసి నిలుచున్నాడు. అతని తల్లీ, తండ్రీ అతన్ని సమర్ధించారు. చాలామంది ఈలలు వేసి చప్పట్లు కొట్టారు. గిరకల పైకి మడిచిన నల్లపాంటు, ఒంటికి అతుక్కుని పోయి కండలను బహిర్గతం చేస్తున్న ఎర్రచాలర బనీను, మెడకు బిగించి కట్టిన రంగుల చేతి రుమాలు, కుడి చేతికి రాగికడియం. మూతమీద కోర మీసం. గిరిజాల జుట్టు. యౌవనంలో వున్న అతన్ని చూసి మల్లికి సరియైన జోడని పెద్దవాళ్లనుకొంటే, రాముడి వయుస్సు వాళ్ళంతా వాడి అదృష్టానికి ఈర్ష్యపడ్డారు. వాడి అందానికి మూర్చపోయి పైకి, కిందకు చూసింది మల్లి. 'అచ్చం నాగేస్సర్రావే' అనుకొంది.

రాముడు ఎగిరిగంతేసి మల్లి చేయందుకొన్నాడు. పాట మొదలయ్యింది దరువుతో.

అద్భుతంగా పాడుతున్నారు పాటగాళ్ళు, తల ఎగరేస్తూ మద్దెల వాయిస్తున్నారు కొండడు, రంగయ్య. దానికి అనుగుణంగా తాళం వేస్తున్నాడు సుబ్బడు. తన్మయత్వంలో ఊగిపోతున్నారు రాముడు, మల్లి.

కాళ్ళని కాళ్ళు, చేతుల్ని చేతులు పెనవేసుకుంటున్నాయి. ఒకరి నడుమును, మరొకరి నడుము, ఒకరి గుండెల్ని మరొకరి గుండెలు ఎన్నోసార్లు స్పర్శించుకొన్నాయి. పాట పూర్తయ్యే సరికి వాళ్ల వశంలో వారు లేరు.

ఫలితంగా మల్లికి రాముడికి మనువు కుదిరింది. అతి తక్కువ ఓలితో మల్లికి, రాముడికి పెళ్ళయింది.

"ఒసే మల్లీ నీ గుడిసె తగలబడిపోయిందే" అంటూ ఎవరో తనను పట్టుకుని కదిలించే సరికి ఈ లోకంలోకి వచ్చింది మల్లి.

శరీరం చలిజ్వరం వచ్చినట్లు వణికిపోయింది. భోరున ఏడుస్తూ గుడిసె వైపు పరుగెత్తింది.

దూరంగా చీకట్లో నాలుకలు చాచుకుంటూ పైకి లేచిన మంటలు. చుట్టూ వున్న వాళ్ళు తమ గుడిసెల్లో వున్న కుండల్తో నీళ్ళు తెచ్చి పోస్తున్నారు. కాని గుడిసె పూర్తిగా కాలిపోయింది.

"గాలి లేదు. లేకపోతే మొత్తం గుడిసెలన్నీ కాలిపోయి వుండేవి" అన్నారెవరో

"అవునమ్మో నా గుడిసెలో కుంచెడు నూకలు, తూముడొడ్లు వుండినయి. అయికూడా కాలిపోయి వుండేయేమో"

"నిజంగా దేవుడు మనందు వుండిండు" వాళ్ళల్లో వాళ్ళు ఓదార్చుకుంటున్నారు. తరువాత వాళ్ల సంభాషణ మల్లి మీదికి పోయింది.

మల్లి ఏడుస్తూ వుంది. ఎవరో లాంతరు పట్టుకొచ్చారు. లాంతరు ఒక చేత్తో పట్టుకొని ఇంకొక చేత్తో కర్రపట్టుకుని కాలిపోయిన శిథిలాలను కదిలించి చూస్తోంది.

ఆమె మనసంతా వేదనతో నిండిపోయింది. తన మొగుడు రాముడు తెచ్చుకున్న సెకండు హేండు పాంటులు, బొమ్మల చొక్కాలు కాలి బూడిదగా మారాయి.

తన చీరలన్నీ బూడిదలో కలిసిపోయాయి.

మావ వస్తాడని మావ కోసం చేసిన చేపల కూర బూడిదతో నిండిపోయింది. పెట్టెలోని బియ్యం పెట్టెతో సహా మాడి బొగ్గయింది.

ఆమెకు తగరం ముద్దలాంటి ఒక వస్తువు కనిపించింది. దాన్ని కర్రతో కదిలించి చూసింది. అది రాముడు ముచ్చట పడికొనుక్కున్న రేడియో కరిగి ముద్దయిపోయింది. దాన్ని చేత్తో తాకితే ఇంకా కాలుతూనే వుంది. దాన్ని కర్రతో దూరంగా నెట్టింది.

తాను బుట్టలో పది గుడ్లు వేసి కోడిపెట్టను పొదుగు వేసింది. మావ తిందామంటే తను వద్దని గుడ్లు పొదిగించి పిల్లల్ని చేయిస్తానని మాట ఇచ్చింది. అవి ఇప్పుడేమయిపోయాయో. తన గుడిసెకు తడిక వేసినందున అవి బయటకు పోయి వుండవు. వాటి కోసం వెదకసాగింది.

ఆ చీకట్లో ఏదో ముద్దగా కనిపిస్తే లాంతరు దగ్గరగా పెట్టి కళ్లు చికిలించుకుని చూసింది. అది కోడి పెట్ట. తల్లికోడి రెక్కలు కాలిపోయాయి. కాలిన శరీరంతో మాంసం ముద్దలా తయారయింది. గోళ్లు నల్లగా మాడి ముడుచుకొని వున్నాయి.

పక్కనే అయిదారు కాలిన చిన్న చిన్న మాంసపు ముద్దలు. అవి ముందురోజు పొదిగిన కోడిపిల్లలుగా గ్రహించింది మల్లి.

పెద్దపెట్టున దుఃఖిస్తూ ఏడ్చింది మల్లి. తను మామకిచ్చిన మాట నెరవేర్చు కోలేకపోయింది. మావకు కోపం తెప్పించింది. మావ గుడ్లు తినకపోవడానికి ఇంకో కారణముంది. మావకు ఎవరో చెప్పారట, కోడిని పొదగేసి పిల్లల్ని పుట్టిస్తే తమకూ పిల్లలు పుడతారని. మావ కోడిగుడ్లు తినకుండా వుండడానికి అదొక కారణం.

మల్లికి దుఃఖం ఆగింది కాదు. కాలిపోయిన కోడిని కోడిపిల్లల్ని పక్కనే పడుకోబెట్టి ముఖం కప్పుకొని భోరున ఏడ్చింది. ఆ ఏడుపుకు అంతులేదు. అంతకంతకు ఎక్కువ కాసాగింది.

ఇంతలో పక్క గుడిసెలో సెంద్రి అంటోంది. "పాపం ఆనక రాముడొస్తే దీని పని ఏటవుతదో"

"దీన్ని సంపేత్తడు. గుడిసె సూడంగానే ఆడి గుండాగిపోదూ" రాములమ్మ జవాబు.

అప్పుడు ఈ లోకంలోకి వచ్చిన మల్లి బెదిరిపోయింది. తన గుడిసె, గుడిసెలోని సామానంతా కరిగిపోయింది. మావకు ఇష్టమైన బొమ్మల చొక్కాలు. రంగు రంగుల పాంట్లు అన్నీ నిప్పుల్లో కలిసిపోయాయి. ఇకపోతే తన చీరలు. ఇవన్నీ తాము ఎప్పటికి సంపాదించు కోగలరు. ఇంత నష్టానికి కారణం తను. మావ తనను కోపంలో ఏం చేసినా చేయగలడు అనుకొంది.

అంతే...... రెండు నిమిషాలలో ఓ దిక్కునపడి చీకట్లోకి పారిపోయింది.

• • •  • • •  • • •

రాముడు భారంగా అడుగులేస్తూ ఇసుకలో నడుస్తున్నాడు వాడికి చాలాకోపంగా వుంది. అడవిరాముడు సినిమా ఈ రోజు నుంచి వేస్తామని బోర్డు వేసి చివరకు బాక్సు రాలేదన్నారు. ఇంత మోసమా. తన కర్మగాకపోతే ఈ రోజే రిక్సా ఒక మడిసిని కోట్టాల్నా. ఆడు పోలీసు రిపోర్టిస్తనని ఎంత యాగీ సేసిండు. అక్కడున్న పెద్దమనుషులంతా వాడికి ఇరవై రూపాయలిప్పించి తన రిక్సా ఇడిపించినారు. రిక్సాను ఓనరుకిచ్చి రిక్సా అద్దె పాతిక ఓనరకిస్తే ఇక తన దగ్గర మిగిలింది అయిదు రూపాయలే.

ఇక సినిమాకేం పోగలరు. అందుకే మూడు రూపాయలకు నూకలు కొని. ఒక రూపాయకు మల్లెపూలు, మరొక రూపాయకు మిరపకాయ బజ్జీలు కొన్నాడు. తనకు మల్లెపూలంటే ఇష్టం. మల్లికి మిరపకాయ బజ్జీలంటే ఇష్టం.

"ఎందుకు మావా నీకు మల్లెపూలంటే అంతిష్టం" అంది ఒకరోజు మల్లి.

"సీకట్లో సెందురుడు వుండడు కదా. అట్టాంటప్పుడు మల్లెపూల ఎల్తుర్లో నీ ముకం సూసుకునేందుకు" చెప్పాడు తను.

"అబ్బో ఆ సినిమాలో సోబన్‌బాబు సెప్పినట్లు కయిత్తం సెబుతుండవే"

"కాక. నాను సెందురుడిని, నువ్వు సుక్కవి"

మల్లిని దగ్గరకు తీసుకుని ఆమె తలలోని మల్లె పూల వాసన పీల్చాడు.

"మల్లీ! మరి నీకు మిరపకాయ బజ్జీలంటే అంతిస్టం దేనికి"

"ఉహూ.... నే సెప్పను" అంది మల్లి.

"అయితే ఏదో వుందన్నమాట రహెస్యం"

"ఉన్నది గాని నాకు సిగ్గేత్తది"

"మల్లీ...ఒసే మల్లీ సెప్పే. నీకు సిగ్గేత్తే నాకు మా తొందరగా వుండాది. కాస్త సెప్పే"

"ఉహూ...." బెట్టు చేసింది మల్లి.

చాలాసేపు బ్రతిమాలింతర్వాత మల్లి దారికి వచ్చింది.

"అయితే ఒక బజ్జీ ఇవ్వు" అంది

చాపమీద పక్కనే వున్న ఆకులో చుట్టి వున్న ఒక బజ్జీ తీసిచ్చాడు రాముడు. దాన్ని తీసుకుని కసుక్కున కొరికి కరాకరా నమలసాగింది.

"ఏటి అర్ధమయిందా" అంది.

"అర్ధం కాలా" అన్నాడు రాముడు తెల్ల ముఖం వేసి.

"మొద్దువి" అంది మురిపెంగా రాముడి బుగ్గలు నిమురుతూ

"అట్టాగే ఒప్పుకొన్నా సెప్పవే"

"నేనెట్లా నములుతుండను"

"కరకరా... పరపరా"

"అద్దదీ సంగతి. నీ నున్నని బుగ్గల్ని కూడా అట్టా కొరకాలని నాకు ఇట్లాంటప్పుడు అనిపిస్తావుంటది. అట్టా ఒకసారి కొరికితే 'ఓయమ్మో' అని పెద్దగా రంకేసినవు. అందుకని నీ బుగ్గల మీద మురిపెమయినప్పుడల్లా ఇట్టా కొరికి ఆస తీర్సుకొంటా" సిగ్గు పడింది మల్లి అంతా చెప్పి.

మల్లి తనను ఎంత ఇదిగా ప్రేమిస్తుందో, తనంటే ఎంత ఇష్టపడుతుందో తెలుసుకొన్న తరువాత మల్లంటే తనకు ప్రేమ ఎక్కువయింది. తామిద్దరూ ఈ రోజు నుంచి వరుసగా నాలుగు రోజులు అడవి రాముడు పాటలు చూసి రాబోయే రంగనాయకుల తిరనాళ్ళకి నెల్లూరులో తమ కులపోల్లు పెట్టే డాన్సు పోటీలకు తామిద్దరూ ఆడి సెబాస్ అనిపించుకోవాలని ఎప్పుడో అనుకున్నారు.

'ఇయ్యాల సినిమాకు తీసుకెల్తానని సెప్పినా. ఎంత అలిగి వుంటుందో నామీద' అనుకొన్నాడు రాముడు. మల్లిని ఎలా మురిపించి కోపం పోగొట్టాల్నా అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

ఇంతలో  ఎవరో ఎదురు వచ్చారు రాముడికి.

"ఒరే రాముడూ..." అంటూ పిల్చాడు ఆవ్యక్తి.

"నువ్వా రంగమావా.... ఏంది ఇంత పొద్దప్పుడు టౌను కెల్తుండవు"

"ఇంత నిదానంగా నడస్తుండవు ఏంది, నీ గుడిసె కాలిపోయిన సంగతి తెలవదా నీకు?"

"నా గుడిసె కాలిపోయిందా" పిచ్చిగా చూసాడు రాముడు.

"అవున్రా నీ గుడిసే. నువ్వు తంతావని నీపెళ్ళాం ఎక్కడికో ఎళ్ళిపోయింది"

రాముడు పిచ్చిగా పరుగెత్తాడు పల్లెవైపు. పరుగెత్తి పరుగెత్తి తమ గుడిసె ముందు నిలబడ్డాడు. గుడిసె వుండవలసిన చోట నల్లని బూడిదరాశి వుంది. గుడిసె ముందున్న వేప చెట్టు ఆకులు సగం కాలివున్నాయి. ఏడుస్తూ అలాగే చూస్తూ వుండిపోయాడు.

"లచ్చుత్తా... లచ్చుత్తా" ప్రక్క గుడిసె తడికి తట్టాడు.

"ఎవురా మడిసి" అంటూ గుడిసెలోంచి బయటికి వచ్చింది లక్ష్మమ్మ.

"మల్లి... నామల్లి ఏడికి పోయిందిదత్తా"

"నీ మల్లా. ఇప్పుడుదాకా కర్రతీసుకుని గుడిసెలోని పెతి వొస్తువుని తలుసుకుని తలుసుకుని ఏడ్సిందిరా. నీకు ఈ విషయం తెలిస్తే దాన్ని సంపేత్తవని పారిపోయిందిరా రాముడూ"

"దాన్ని నేనెందుకు కొడ్తానత్తా. ఎటెల్లిందో తెల్సా"

"ఆ రెడ్డిగారి మామిడితోపు సాయి ఎల్లిందిరా" అంటూ దూరంగా వున్న మామిడితోపు చూపించింది.

అంతే, ఆచీకట్లో "మల్లీ... మల్లీ" అంటూ పరుగెత్తి, మామిడి తోటంతా అరుస్తూ తిరిగాడు. వాడి కేకలకు జవాబు రాలేదు. అలసిపోయి ఒక చెట్టు మొదట్లో కూర్చొని అలాగే నిద్రపోయాడు.

తూర్పు తెల్లవారింది. రాముడిచేతిలోని మల్లెల పొట్లం, మిరపకాయల బజ్జీల పొట్లం పక్కనే పడివున్నాయి. అదే మామిడి చెట్టుపైన భయంతో కొమ్మను కౌగిలించుకుని పడుకుని వున్న మల్లి మెలుకువ వచ్చి చెట్టు దిగింది.

చెట్లు మొదట్లో కూర్చొని వున్న రాముడు 'మల్లీ... మల్లీ' అంటూ పలవరిస్తూ కళ్ళు తెరిచాడు. మల్లి రాముడ్ని సమీపించింది భయం భయంగా. రాముడి కళ్ళల్లో కోపం లేదు ప్రేమ వుంది.

ఆ చూపులు క్రూరంగా లేవు. ఆహ్వానిస్తున్నట్లున్నాయి.

"మల్లీ" అంటూ చేతులు చాపాడు.

"మావా" అంటూ పరుగెత్తికు వెళ్ళి అతని కౌగిట్లో వాలింది.

"మావా నీకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయినా. గుడిసెలో సామానంతా బూడిదయింది. కోడిపెట్ట పిల్లలతో సహా కాలిపోయింది" ఏడుస్తూ అంది మల్లి.

"ఏడవకు మల్లీ అయిపోతే పోయినయిగాని. నువ్వు దక్కితే అంతే సాలు. ఏడకిపోయినా మనం బతగ్గలం"

"నామీద కోపం లేదా మావా"

"లేదు"

"నిజంగానే"

"నిజంగానే"

"ఎంత మంచివాడివి మావా" రాముడ్ని కౌగిలించుకొని ఆనందబాష్పాలు రాల్చింది మల్లి.

రాముడు రెండు వేపపుల్లలు విరుచుకువచ్చాడు. ఇద్దరూ పళ్ళుతోముకున్నారు. పక్కనే కాలువ పారుతోంది. ఇద్దరూ బట్టలు విడిచి అందులోకి దిగారు. నీళ్ళలో దిగి ఒకరినొకరు తరుముకొన్నారు. ఒకరిపై ఒకరు నీళ్లు చల్లుకున్నారు. ఇద్దరూ ఆనందంగా స్నానం చేయసాగారు.

"మల్లీ మనం ఏడకు పోయినా బతగ్గలం. మనకు దేవుడిచ్చిన సంపద నాకునీవు, నీకునేను" అన్నాడు మోచేయ ముడిచి కండల్ని చూపిస్తూ.

ఉక్కుమనిషిలా వున్నాడు రాముడు.

రాముడు తదేకంగా తనవైపు చూస్తుండడంతో తనను తాను మరొకసారి చూసుకుంది. ఒకే పొరతో ఒంటికి అంటుకుపోయిన జానెడు గుడ్డ నడుంమీదుంది. మరో బెత్తడు గుడ్డముక్క గుండెల మీదుంది.

"సీ…సీ…" అనుకుంటూ రాముడివైపు ఓరగా చూసింది.

"అరరరరె…ఎట్టాగో వున్నాది ఓలమ్మీ… ఏటేటో అవుతుంది సిన్నమ్మీ…" మల్లి చేయి పట్టుకుని దగ్గరకు లాగుతూ పాట ఎత్తుకున్నాడు రాముడు.

"అరరరరె… ఎట్టాగో ఉన్నాది ఓరబ్బీ… ఏటేటో అవుతుంది సిన్నబ్బీ…" తనను తాను మరిచి పాట అందుకుని అంతలోనే సిగ్గుపడి రాముడి గుండెల్లో ముఖం దాచుకొంది మల్లి.

వారి మనసులు నిష్కళంకం.

వారి ప్రేమ శాశ్వతం ✸

***(స్వాతి వీక్లీ, తేది 12-3-93)***